

వేంకటేశ్వర స్వామి మందిరంలా కరాస రాక్‌స్టార్ యూత్ నిర్మించిన మండపం



వినాయక విగ్రహాలను అందిస్తున్న కార్పొరేటర్ వెంకటరమేష్



వర్షం తెరిపివ్వడంతో రైల్వేస్టేషన్ రోడ్డులో పోటెత్తిన జనం

కొలువుదీరనున్న శివపుత్రుడు

- మండపాలకు తరలుతున్న గణనాథులు
- మార్కెట్‌లో చవితి సందడి
- వర్షం వల్ల ప్రజలు, వ్యాపారుల అవస్థలు



పవనసుతుడితో శివపుత్రుడు



అనంత పద్మనాభస్వామి అవతారంలో వినాయకుడు

గోపాలపట్నం: బొజ్జ గణపయ్య కొలువుదీరే రోజు రానేవచ్చింది. మేళతాళాలతో గణనాథులను ఊరేగింపుగా తీసుకువస్తున్నారు. విభిన్న ఆకృతుల్లో రూపొందిన పార్వతీతనయుడిని ప్రతిష్ఠించేందుకు ఆకర్షణీయమైన మండపాలు సిద్ధమయ్యాయి.

మార్కెట్‌కు చవితి శోభ

తెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉండడంతో వ్యాపారమెలా సాగుతుందో అని ఆందోళన చెందిన వ్యాపారులు మంగళవారం సాయంత్రానికి కాస్త ఉపశమించడంతో ఊపిరి పీల్చుకున్నారు. దీంతో సాయంత్రం మార్కెట్లు వినియోగదారులతో కళకళలాడాయి. ఉదయం వర్షం కారణంగా రైతుబజారులో కొనుగోలుదారులు అంతంతమాత్రంగానే ఉండగా, సాయంత్రానికల్లా జనంతో కిటకిటలాడింది. ఉదయమంతా పలువురు వ్యాపారులు వర్షంలో తడుస్తూ అమ్మకాలు సాగించారు. ఒక వృద్ధురాలు వర్షంలోనే చలికి వణుకుతూ పత్రి అమ్మకాలు చేయడం చేసి చలించిన కొందరు ఆమెవద్దనే కొనుగోలు చేసి, మానవత్వం చాటుకున్నారు. 89వ వార్డు కొత్తపాలెంలో కార్పొరేటర్ దాడి వెంకటరమేష్ వినాయక ప్రతిమలు అందించారు.

విగ్రహాల తరలింపు : సోమవారం సాయంత్రం నుంచీ వర్షం కురుస్తూనే ఉండటంతో ఆ వానలోనే విగ్రహాలను తరలించారు. వ్యానుల్లో ప్రత్యేకంగా టార్పాలిన్లు రక్షణగా ఏర్పాటు చేసి తరలించారు.

కంచరపాలెం: వినాయకచవితిని పురస్కరించుకుని మంగళవారం కంచరపాలెం, ఊర్వశికూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా మార్కెట్లు సందడిగా మారాయి. తెరిపిలేకుండా వాన పడుతున్నా చవితి సామగ్రి విక్రయాలు జరిగాయి. కంచరపాలెం కూడలి నేతాజీ ఫ్లైఓవర్ నుంచి ఊర్వశికూడలికి వెళ్లే బీఆర్‌టీఎస్ రహదారులపై దుకాణాలు ఏర్పాటు చేయడంతో రోడ్లు కిక్కిరిసిపోయాయి. సాయంత్రం వర్షం కాస్త తగ్గడంతో వినాయక ప్రతిమలు, పత్రి, తదితర పూజాసామాగ్రిని ధరలు పెంచి విక్రయించారు వ్యాపారులు.



ఆకట్టుకుంటున్న విగ్రహాలు



మేళ తాళాలతో మండపానికి తరలిస్తున్న వినాయక విగ్రహం



కంచరపాలెంలో వర్షంలోనే పూజాసామగ్రి విక్రయిస్తున్న మహిళలు



వర్షంలో వణుకుతూ పత్రి అమ్ముతున్న వృద్ధురాలు



వర్షానికి తడవకుండా భారీ విగ్రహాలకు ముసుగు వేసిన దృశ్యం



గోపాలపట్నం రైతుబజారులో పల్చగా జనం

పాప్‌కార్న్‌తో వినాయకుడు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ప్రకాష్‌నగర్‌లో వినాయకుడు విభిన్నంగా కొలువుదీరనున్నారు. అంబేడ్కర్ కల్చరల్ కమిటీ ఆధ్వర్యంలో పాప్‌కార్న్‌తో వినాయకుడిని తయారు చేస్తున్నారు. సుమారు 20 కేజీల పాప్‌కార్న్‌తో 15 అడుగుల ఎత్తుతో విగ్రహాన్ని రూపొందిస్తున్నారు. నిర్వాహకులు రావాడ ఈశ్వరరావు, చందు, దినేష్, అచ్యుత్, జశ్వంత్, ముని సుమారు 20 వేల రూపాయలతో ఈ విగ్రహాన్ని తయారు చేయిస్తున్నారు. పూజల అనంతరం బుధవారం ఉదయం 10 గంటల నుంచి భక్తులకు దర్శనాలు కల్పించనున్నారు.



పాప్‌కార్న్‌తో వినాయకుడిని రూపొందిస్తున్న నిర్వాహకులు

క్లుప్తంగా

షిప్‌యార్డ్‌లో గణపతి పూజలు



పూజల్లో పాల్గొన్న కార్మికులు

మల్కాపురం: వినాయకచవితి సందర్భంగా హిందూస్థాన్ షిప్‌యార్డ్‌లోని పలు విభాగాల్లో మంగళవారం గణపతి పూజలు చేశారు. షిప్‌యార్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. కార్యక్రమంలో పలు డిపార్ట్‌మెంట్‌ల కార్మికులు, యూనియన్ నాయకులు పాల్గొని, పూజలు చేశారు.

చిన్నారులకు హాట్ బాక్స్‌ల పంపిణీ



చిన్నారులతో ట్రస్టు నిర్వాహకుడు సత్యనారాయణ

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు గణపతినగర్‌లో పలువురు చిన్నారులకు హాట్ బాక్స్‌లు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ అమ్మ నాన్న చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేశారు. మదర్‌థెరిసా జయంతిని పురస్కరించుకుని ట్రస్టు 9వ వార్షికోత్సవం సందర్భంగా గణపతినగర్‌లో గల పలువురు చిన్నారులకు హాట్ బాక్స్‌లు, బిస్కెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సేవ చేయాలనే సంకల్పంతో అమ్మ నాన్న చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఏటా ఆగస్టు 26వ తేదీన మదర్‌థెరిసా జయంతి రోజు ట్రస్టు ద్వారా పేదలకు సేవలందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అర్జున్, అప్పలరాజు, చిరంజీవి, మడక ఎర్రయ్యమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎదుర సత్యనారాయణ, సరోజ, లక్ష్మీచందు, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కుమార్‌రాజుకు అభినందన



కుమార్‌రాజును సత్కరిస్తున్న నిర్వాహకులు

మల్కాపురం: ప్రముఖ సాహితీ వేత్త, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజును పలువురు మంగళవారం ఘనంగా సత్కరించారు. మల్కాపురం శాఖా గ్రంథాలయం వద్ద జరిగిన కార్యక్రమంలోచిత్రకళా పరిషత్తు అధ్యక్షుడు సుంకర చలపతిరావు మాట్లాడుతూ కుమార్‌రాజు సాహిత్య,సాంస్కృతిక,కళా,సేవా రంగాలకు ఎనలేని సేవ చేస్తున్నారని వివరించారు.ఆయన సేవలను గుర్తించి విశ్వసాహితీ కళావేదిక ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడిగా నియమించిందని కొనియాడారు. జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రముఖులను సన్మానించడం సమాజ కర్తవ్యం అని అన్నారు.కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్, చిత్రకారుడు ద్వారపూడి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చిత్రలేఖన పోటీలు



పోటీలో పాల్గొన్న చిన్నారి



దేవుని రూపాన్ని వేస్తున్న చిన్నారి

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురంలో వినాయకచవితి సందర్భంగా ప్రముఖ చిత్రకారుడు, సామాజిక సేవా కార్యకర్త చెల్లూరి భాస్కరరావు ఆధ్వర్యంలో మంగళవారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పలు ప్రాంతాలకు చెందిన చిన్నారులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని చక్కటి ప్రతిభ కనబరిచారు. విజేతలకు చెల్లూరి భాస్కరరావు బహుమతులు అందించారు.

గ్రంథాలయంలో రికార్డుల తనిఖీ

పెదగంట్యాడ: మండలంలోని శాఖా గ్రంథాలయాన్ని విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వార్షిక రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ శాతం ధరావతు సభ్యులను చేర్చాలన్నారు. చదువు అంటే మాకిష్టం కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు.

తెరిపివ్వని వాన

- రోడ్లు జలమయం
- జింక్ వద్ద నిలిచిపోయిన ట్రాఫిక్



వర్షం కారణంగా ఆర్‌కే పురం సేవా మార్గం బురదమయంగా మారిన దృశ్యం



జింక్ నుండి గాజువాక వెళ్లే మార్గంలో నిలిచిపోయిన వాహనాలు



మల్కాపురం సేవా మార్గంలో నిలిచిపోయిన వ్యర్థాలు



సప్తగిరి జంక్షన్ వద్ద రోడ్డుపై చేరిన వర్షం నీరు

మల్కాపురం: రెండు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పారిశ్రామిక ప్రాంతంలో గల పలు సేవా మార్గాలు జలమయం అయ్యాయి. పలు చోట్ల వ్యర్థాలు నిలిచిపోయాయి. వర్షం వల్ల ఇంటి నుండి బయటికి రాలేని పరిస్థితి నెలకొంది. 61వ వార్డు ఆర్‌కేపురం సేవా మార్గం పూర్తిగా బురద నీటితో నిండిపోయింది. దీంతో వాహనచోదకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అలాగే మల్కాపురం, ఐవోసీకి వెళ్లే మార్గాల్లోని సేవా మార్గాల్లో వ్యర్థాలు నిలిచిపోయయాయి. జింక్ నుండి కొత్త గాజువాక వెళ్లే మార్గంలో పలువరు వ్యాపారులు రోడ్డుపై వ్యాపారాలు సాగించటం, వినాయక చవితి పూజా సామగ్రి కొనుగోలుకు పలువురు తమ వాహనాలు అడ్డంగా నిలపటంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకొంది

ముసురుకున్న వర్షం..

గోపాలపట్నం: బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనంతో మంగళవారం ఉదయం నుంచి వర్షం కమ్ముకుంది. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో జనజీవనం స్థంబించిపోయింది. ఆఫీసులు, పాఠశాలలకు వెళ్లే వారు నానా అవస్థలు పడ్డారు. వినాయక చవితి పండగ కావడంతో వ్యాపారులు కూడా తీవ్రంగా నష్టపోయామని వాపోయారు. ఆకుకూరలు, కాయగూరల వ్యాపారులు వ్యాపారం సాగక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రహదారులు జలమయమయ్యాయి. వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. అయితే సాయంత్రానికి వర్షం తగ్గుముఖం పట్టడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పోరాటంతోనే సమాన పనికి సమాన వేతనం



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

గోపాలపట్నం: సమాన పనికి సమాన వేతనం సాధించేందుకు పోరాటం చేయాలని ఏపీ మున్సిపల్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఉమా మహేశ్వరరావు పిలుపునిచ్చారు. గోపాలపట్నం కుమారి కల్యాణ మండపంలో నిర్వహించిన జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ 11వ జిల్లా మహాసభలను ప్రారంభించారు. తొలుత పతాకాన్ని యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి. వెంకటరెడ్డి ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులంతా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. సిటు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ సీఐటీయూ ఆలిండియా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. నివేదికను ఉరుకూటి రాజు సభలో ప్రవేశ పెట్టారు. సిటు జిల్లా సీనియర్ నాయకుడు వెంకటరెడ్డి, గోపాలపట్నం జోన్ ప్రధాన కార్యదర్శి బలివాడ వెంకటరావు, రాష్ట్ర కార్యదర్శి నాయుడు కార్మికులనుద్దేసించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సూరీడు, నూకరాజు, అధిక సంఖ్యలో జీవీఎంసీ కార్మికులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష పూజలు



వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేష పూజలు జరిగాయి. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

మట్టి వినాయక ప్రతిమల అందజేత



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న దొడ్డి కిరణ్

గోపాలపట్నం: పర్యావరణానికి మట్టి వినాయకులే మంచిదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి దొడ్డి కిరణ్ అన్నారు. ఆయన కార్యాలయంలో మంగళవారం మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. విగ్రహాలతో పాటు వ్రతకథా పుస్తకాలను అందించారు. ఆయన మాట్లాడుతూ తొలిపూజలందుకునే వినాయకుడు అందరికీ మంచి చేయాలని ఆకాంక్షించారు. డీకే ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మురళి విజయ్‌కుమార్, తులసి రవి తదితరులు పాల్గొన్నారు.

మతి స్థిమితం లేని మహిళ ఆస్పత్రికి తరలింపు

గోపాలపట్నం: మతి స్థిమితం లేని మహిళను పోలీసులు ఛారిటీ సంస్థ ప్రతినిధుల ద్వారా మానసిక ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధి సింహాచలం పాతగోశాల ప్రాంతంలో దుస్తులు లేకుండా మతిస్థిమితం లేని మహిళ తిరుగుతుందన్న సమాచారం అందడంతో సీఐ ఎస్‌వీ ప్రభాకర్ వెంకటనే స్పందించారు. మహిళా కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్‌ను పంపించారు. వీరు ఆ మహిళను గుర్తించి దుస్తులు వేయించారు. అనంతరం మమత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి మమత సహకారంతో చినవాల్తేర్ మెంటల్ కేర్ ఆస్పత్రిలో చేర్పించారు. ఇది చూసిన స్థానికులు పోలీసులు స్పందించిన తీరును అభినందించారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

మహిళల భద్రతపై విద్యార్థినులకు అవగాహన

దాబాగార్డెన్స్: మహిళలకు ఏదైనా సమస్య ఎదురైనప్పుడు 100కు కాల్ చేస్తే నిమిషాల వ్యవధిలోనే సహాయం అందుతుందని రిటైర్డ్ ఆదాయపు పన్ను కమిషనర్ వడ్డాది అప్పలరాజు పేర్కొన్నారు. అలయన్స్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ఆవరణలో సింహాద్రి టీఎంటీ, విశాఖ సిటీ మహిళా పోలీస్ స్టేషన్ సంయుక్తంగా మంగళవారం మహిళల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో విలువైనదన్నారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో చదివిస్తున్నారని, వారి ఆశలు వమ్ము చేయొద్దని కోరారు. మహిళల భద్రతపై అనేక చట్టాలు, పథకాలు, నివారణ చర్యలు అమల్లో ఉన్నాయని, ప్రభుత్వ చట్టాలతో పాటు మహిళలు తమ భద్రత కోసం జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే పోలీసులకు కాల్ చేయడం, ఒంటరిగా వెళ్లకుండా కుటుంబ సభ్యులతో వెళ్తుండాలన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే అప్రమత్తమై పోలీసులకు కాల్ చేయడానికి వెనుకాడకూడదని, డయల్ 100కు కాల్ చేస్తే నిమిషాల వ్యవధిలో సహాయం అందుతుందన్నారు. మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై యు.రూప మాట్లాడుతూ అమ్మాయిలు జాగ్రత్తగా ఉండాలని, మీ చుట్టే మానవ రూపంలో కీచకులు ఉంటారని, అవసరమైతే తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిత్యం ఎక్కడో చోట మహిళలపై లైంగికదాడులు జరుగుతున్న సంఘటనలు చూస్తూనే ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో కందుకూరి శ్రీనివాసరెడ్డి, ఎంఎస్ కుమారి, మళ్ల అప్పలరాజు, అలయన్స్ కాలేజీ హోటల్ మేనేజ్‌మెంట్ చైర్మన్ కొల్లా సతీష్‌కుమార్, డాక్టర్ బీఏఎస్ నంద, ఆర్.కిరీటికుమార్, ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, హిమా హ్యూమానిటేరియన్ వ్యవస్థాపక కార్యదర్శి టీవీడీ దాస్ తదితరులు పాల్గొన్నారు.